## క్లుప్తంగా

### డాక్టర్ అనూషకు ఎన్క్వాస్ సర్టిఫికెట్



మంగళగిరి: స్థానిక ఇందిరానగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ పి.అనూష జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, డీఎంహెచ్‌వో విజయలక్ష్మి చేతుల మీదుగా గురువారం ఎన్క్వాస్ సర్టిఫికెట్ అందుకున్నారు. జాతీయ స్థాయిలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్న హెల్త్ సెంటర్‌గా ఇందిరానగర్‌లోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ గుర్తింపు పొందింది. అందుకుగాను ఎన్క్వాస్ సర్టిఫికెట్ లభించింది.

### షేక్ సుభానీకి సేవారత్న పురస్కారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : రచయిత, కళా పోషకులు షేక్ సుభానీని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం దుగ్గిరాలలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి మాట్లాడుతూ అంతర్జాతీయ ఐఎస్ఓ గుర్తింపు పొందిన పద్మభూషణ్ గుర్రం జాషువా కళాపరిషత్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2024 సేవారత్న పురస్కారాన్ని షేక్ సుభానీకి బహూకరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కుర్రా నాగయ్య, కాకా వెంకటేశ్వర్లు, తాడిబోయిన రావుగోపాలరావు, వీరంకి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### ముమ్మరంగా పూడికతీత



మంగళగిరి: స్థానిక రత్నాలచెరువు, కొప్పురావు కాలనీల్లోని మురుగు కాలువలలో పూడికతీత ముమ్మరంగా సాగుతోంది. పొక్లెయిన్‌తో పనులు చేస్తున్నారు. వ్యర్థాల్ని ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. పూడికతీత పనుల్ని ఎంటీఎంసీ కమిషనర్ ఆలీంబాషా పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పనుల్ని వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మురుగు కాలువలతో పాటు రోడ్లపై నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### భారత్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



మంగళగిరి: రక్తదానం ప్రాణదానంతో సమానమని నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ రేఖా నరేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని టిడ్కో నివాసాల వద్ద భారత్ సేవా ట్రస్ట్ ,సెంట్రల్ ట్యాక్స్ సీజీఎస్టీ కమిషనర్ ఆధ్వర్యంలో గురువారం రక్తదానం శిబిరం నిర్వహించారు. యాభై మంది యువకులు రక్తదానం చేశారు. పలువురు వారిని అభినందించారు. కార్యకమంలో యూనిట్ ప్రతినిధులు దినేష్, కార్తిక్, భారత్ సేవా ట్రస్ట్ సేవా ప్రతినిధులు వజ్జూరు నాగేంద్ర కుమార్, తేలు ఫిరోజ్, గడ్డం వెంకటేశ్వరరావు, కాట్రు ధనుంజయరావు, కూర్మరాజు పాల్గొన్నారు.

### బడ్డీ కొట్టులో చోరీ

గుంటూరు ఈస్ట్: బడ్డీ కొట్టులో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. అన్నపురెడ్డి మస్తాన్‌రెడ్డి మిర్చి యార్డు రోడ్డులో బడ్డీ నడుపుకుంటున్నాడు. గురువారం కొట్టు తెరిచేందుకు వెళ్లగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపల పరిశీలించగా రూ. 35వేలతో పాటు రెండు సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఇంటిలో చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంటిలో చోరీపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సాయినగర్‌లో నివసించే రామచంద్ర సహాని గదిలో లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తలుపు బలవంతంగా తెరిచి సెల్‌ఫోను, రూ. 200 ఎత్తుకు పోయాడు. ఈ మేరకు బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### స్థలం ఇప్పిస్తానని మోసం

గుంటూరు ఈస్ట్: స్థలం ఇప్పిస్తానని మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీఅగ్రహారంలో నివాసం ఉండే ఉడతా శ్రీనివాసరావుకు కృష్ణారెడ్డి, శైలజ పరిచయమయ్యారు. గుంటూరు నగరంలో ఓ స్థలం చూపించి తక్కువ రేటుకు ఇప్పిస్తామని నమ్మబలికారు. విడతల వారీగా రూ. 16 లక్షలు తీసుకున్నారు. స్థలం ఇప్పించకపోవడంతో శ్రీనివాసరావు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సందడిగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నిక

- పలుచోట్ల ఏకగ్రీవం
- ఉత్సాహంగా పాల్గొన్న తల్లిదండ్రులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండల పరిధిలోని పలు పాఠశాలల్లో గురువారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్‌గా తెనాలి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా తమ్మా రాజేశ్వరి, కో–ఆప్టెడ్ మెంబర్స్‌గా మండలనేని లక్ష్మీనారాయణ, పఠాన్ నాగుల్‌మీరాఖాన్ ఏక్రగీవంగా నియమితులయ్యారు.

- తాడేపల్లి పట్టణ పధిలోని అంజిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల చైర్మన్‌గా పరిశపోగు విమల్‌కుమార్, వైస్ చైర్మన్‌గా అనితరాణి ఎన్నికయ్యారు. నూతన కమిటీతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.
- దుగ్గిరాల మండల పరిధిలోని ఏడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 44 మండల పరిషత్, మూడు ఎయిడెడ్ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ సభ్యుల్ని ఎన్నుకున్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా కంచర్ల కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా వట్లూరి లక్ష్మీసునీత ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయులు కె. ఆంథోని రాజు తెలిపారు.



పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాల నూతన మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు



డోకిపర్రు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చెర్మన్, వైస్ చైర్మన్‌లతో టీచర్లు



దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ పాఠశాలలో ప్రమాణం చేస్తున్న సభ్యులు

### పాఠశాల అభివృద్ధికి కృషి

ఫిరంగిపురం: పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎస్ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ) చైర్మన్ జి. సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని పొనుగుపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడి పర్యవేక్షణలో స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. చైర్మన్‌గా గేరపాటి సురేష్‌కుమార్, వైస్ చైర్మన్‌గా రాచకొండ కోమలి, మరో 22మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పొనుగుపాడు జిల్లాపరిషత్ పాఠశాలలో ప్రమాణం చేస్తున్న సభ్యులు

### ప్రశాంతంగా ఎన్నికలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ ఎన్నికలు ముగిశాయి, ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు, ఎంఈవోలు సత్యనారాయణ, బాబు ఎన్నికలను పర్యవేక్షించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఏకగ్రీవమైన డోకిపర్రు పాఠశాల ఎన్నిక



మంగళగిరి ఇందిరా నగర్ మున్సిపల్ పాఠశాలలో ఎన్నికైన సభ్యులు

మేడికొండూరు: డోకిపర్రు మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. గురువారం జరిగిన ఎన్నికల్లో చైర్మన్‌గా గట్టు సాంబశివరావు, వైస్ చైర్మన్‌గా చెవూరి కోమలిని విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకున్నారు. అన్ని తరగతులకు 24 మందిని విద్యా కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్.వి.మాధవి తెలిపారు. ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఎం.సుబ్బారావు, బ్రహ్మయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, షేక్ అజ్మతుల్లా, చేవూరి హరికృష్ణ, యు.గనిబాబు, అధ్యాపక, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## చెరువును తలపిస్తున్న ప్రధాన రహదారి



కార్యాలయాలకు వెళ్లే రహదారి దుస్థితి

తాడికొండ: రాజధాని అమరావతి కేంద్రమైన తుళ్లూరులో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే మరి. రహదారి లోతట్టు ప్రాంతంగా ఉండటంతో నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. మోకాళ్ల లోతున్న ఈ నీటిలోనే వివిధ కార్యాలయాలకు పనుల నిమిత్తం వచ్చే పాదచారులు, వాహనదారులుల వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

రెవెన్యూ, ఎంపీడీవో, విద్యాశాఖ, వెలుగు ప్రాజెక్టు తదితర కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండటంతో ఈ రోడ్డుపై నడక ఇబ్బందికరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి ప్రజా సమస్యల సంగతేమో గానీ, ఆ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చే కార్యాలయానికి వెళ్లే రహదారి సమస్యను సత్వరం తీర్చాలని పలువురు కోరుతున్నారు.

# అక్షయపాత్ర సేవలు భేష్

జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవతేజ

మంగళగిరి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరాలో అక్షయపాత్ర సేవలు భేష్ అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ ప్రశంసించారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి పక్కనున్న అక్షయపాత్ర ఫాండేషన్‌ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా భోజనం తయారీ మిషనరీ, కూరగాయలు, బియ్యం శుభ్రం చేసే విధానం, తయారైన భోజనాన్ని వాహనాల ద్వారా ఐదు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా అంశాల్ని క్షుణ్ణంగా తెలుసుకున్నారు. మెనూ ప్రకారం వండిన భోజనాన్ని రుచి చూశారు. నాణ్యతతో పాటు రుచిగా ఉండటం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో పద్మావతి, తహసీల్దార్ షేక్ మాబు సుభాని, అక్షయపాత్ర ప్రతినిధులు రామన రేష్ దాస, శ్రీహరి నాయుడు పాల్గొన్నారు.



భోజన తయారీని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

## వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

తాడేపల్లి రూరల్: వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో గురువారం ఇద్దరు మృతి చెందారు. నులకపేట సబ్‌స్టేషన్ పరిధిలో ప్రకాష్ నగర్ రెల్లీస్ కాలనీలో నివాసముండే కోడూరు నాగమణి (65) పక్షవాతంతో ఇంట్లోనే ఉంటోంది. తెల్లవారుజామున ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో ఒంటిపై వైర్లు పడి అక్కడికక్కడే మృతి చెందింది. బంధువుల ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు ఫిర్యాదు నమోదు చేశారు.

- ప్రకాశం బ్యారేజ్ అమరావతి కరకట్ట వెంబడి విద్యుత్ స్తంభాలకు విజయవాడకు చెందిన వై. అప్పలనాయుడు (50) ఫ్లెక్సీ బోర్డులు కడుతున్నాడు. ఈ సమయంలో అప్పారావు గెస్ట్‌హౌస్ వద్ద స్తంభానికి విద్యుత్ సరఫరా అవ్వడంతో దాన్ని పట్టుకున్న అప్పలనాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. జరిగిన సంఘటనపై తోటి కార్మికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పోలీసులమని బెదిరించి డబ్బులు వసూలు ?

గుంటూరు ఈస్ట్: పోలీసులమంటూ దుస్తుల షాపు యజమానిని ఇద్దరు బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు అందినట్లు సమాచారం. సేకరించిన సమాచారం మేరకు.. కొత్తపేటలోని ఓ బట్టల షాపునకు గురువారం ఇద్దరు వ్యక్తులు పోలీసులమంటూ వెళ్లారు. పన్ను ఎగవేస్తున్నావంటూ, నకిలీ బ్రాండ్ దుస్తులు విక్రయిస్తున్నావంటూ యజమానిని బెదిరించి రూ. 1.60 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం.

### శాస్త్రీయ విజ్ఞానాన్ని మానవాభివృద్ధికే వినియోగించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: శాస్త్రీయ విజ్ఞానాన్ని మానవాభివృద్ధికి వినియోగించాలని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జె. ఉషారాణి పేర్కొన్నారు. గుజ్జనగుండ్లలోని కళాశాలలో గురువారం కోల్‌కత్తాకు చెందిన ముందడుగు విద్యా, వైజ్ఞానిక సంస్థ ఆధ్వర్యంలో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి పట్టణాలపై అమెరికా ప్రయోగించిన అణుబాంబు కారణంగా జరిగిన విధ్వంసంపై విద్యార్థినులకు స్లైడ్స్, డాక్యుమెంటరీ రూపంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉషారాణి మాట్లాడుతూ అమెరికా దుశ్చర్య కారణంగా లక్షలాది ప్రజలు మరణించారన్నారు. ఈ యుద్ధం కలిగించిన వినాశన ఫలితాన్ని ఇప్పటికీ అక్కడి ప్రజలు అనుభవిస్తున్నారని తెలిపారు. సైన్స్ ఫలాల్ని అభివృద్ధికి కాకుండా వినాశనానికి ఉపయోగిస్తే ఎంతటి దారుణమైన ఫలితాలు ఉంటాయో చెప్పేందుకు హిరోషిమా, నాగసాకి పట్టణాలే నిదర్శనమన్నారు. ముందడుగు సంస్థ కార్యదర్శి ఐకా బాలాజీ మాట్లాడుతూ కార్పొరేట్ వ్యాపార సంస్థల ప్రయోజనాల కోసం దేశాలపై దురాక్రమణలు జరుగుతున్నాయని తెలిపారు. యుద్ధాలని వ్యతిరేకించి, నివారించాల్సిన బాధ్యత యువతరంపై ఉందని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు రమాసుందరి, నిర్మల, లోకేష్, బీవీ ప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# పండ్ల తోటల పెంపకంతో అధిక లాభాలు

ఫిరంగిపురం: పండ్ల తోటల పెంపకంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి ఉమాదేవి సూచించారు. మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా హార్టీకల్చర్ ద్వారా ఎకరంలో వేసిన మామిడి తోటను గురువారం ఆమె ఎంపీడీవో విమాదేవితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ హార్టీకల్చర్ ద్వారా ప్రభుత్వం పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని, రైతులు దీన్ని వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. మునగ పంట కూడా లాభదాయకంగా ఉందని, దాంతో పాటు అంతర పంటలు వేసుకోవాలని చెప్పారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా షెడ్లు వేసుకునేందుకు ప్రభుత్వం నిధులు అందజేస్తోందని, దీన్ని పాడి రైతులు, పశువులకాపరులు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. అవసరమైన వారు పశువైద్యాధికారులకు పత్రాలు అందజేయాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థుల్ని కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఇస్తున్న రాగిజావను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీవో విమాదేవి, పంచాయతీ కార్యదర్శి సత్యానంద్, సిబ్బంది ఉన్నారు.



మామిడి మొక్కలు పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉమాదేవి, ఎంపీడీవో విమాదేవి

# దక్షిణ భారత దేశానికి గోల్డ్ హబ్‌గా మంగళగిరి

భద్రావతి సమేత భావనారుషి ఆలయ ప్రారంభంలో మంత్రి లోకేష్ దంపతులు

మంగళగిరి: పద్మశాలీయ బహూత్తమ సంఘం చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అన్ని వర్గాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ కొనియాడారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని నాంచారమ్మ చెరువు ప్రాంగణంలో పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన భద్రావతి సమేత భావనారుషి ఆలయంతో పాటు కల్యాణ మండపాన్ని గురువారం మంత్రి లోకేష్ బ్రాహ్మిణి దంపతులు ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, పంచుమర్తి అనురాధలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ పద్మశాలీయ సంఘం చేపట్టే కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మంగళగిరి చేనేతలు తమకు ఆత్మ బంధువులని, ఎన్నికలలో వారు తమపై చూపిన అభిమానం జీవితంలో మరువలేనన్నారు. చేనేత కార్మికుల ఆదాయం పెంచడానికి వీవర్స్ శాల ఏర్పాటు చేసి టాటా తవేరి కంపెనీతో మార్కెట్ లింకేజీ చేశామని తెలిపారు. మంగళగిరిలో స్వర్ణకారులకు స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా మెరుగైన డిజైన్లు తయారు చేసేలా శిక్షణ ఇస్తామని చెప్పారు. దక్షిణ భారతదేశానికి గోల్డ్ హబ్‌గా మంగళగిరిని తీర్చిదిద్దడానికి 25 ఎకరాలలో ప్రత్యేక గోల్డ్ హబ్‌గా ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు జగ్గారపు శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు నందం అబద్ధయ్య, దామర్ల రాజు, కాండ్రు శ్రీనివాసరావు, వింజమూరి ఆషాబాల, పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు దామర్ల కుభేర స్వామి, చింతక్రింది కనకయ్య, జొన్నాదుల వరప్రసాద్ ,రామనాథం పూర్ణచంద్రరావు, గుత్తికొండ ధనుంజయరావు, వంగర కిశోర్, గంజి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.



ఆలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి నారా లోకేష్ దంపతులు

# ఆహార నియమాలతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: ఆహార నియమాలతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఆరోగ్య సిబ్బంది సూచించారు. మండలంలోని వేములూరిపాడులో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్వేత 89మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు, షుగర్ వ్యాధిగ్రస్తులకు కేర్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా ఆహార నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. షుగర్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా బొప్పాయి, జామ ఫలాలతో పాటు తాజాగా ఉన్న పండ్లు కొద్దిమొత్తంలో తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, బాబూరావు, విజయ్‌కుమార్, ఆర్. ఆంథోనిరాణి, ఆశా కార్యకర్తలు పద్మ, సుజాత, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

# రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యత

జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి

లక్ష్మీపురం: రక్తదానం ప్రతి ఒక్కరి బాధ్యతని కస్టమ్స్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్, తిరుపతి కమిషనరేట్, కస్టమ్స్ కమిషనరేట్ పరిధిలోని 51 కేంద్రాల్లో తలసేమియా రోగుల కోసం గురువారం దాదాపు ఆంధ్రప్రదేశ్ అంతటా మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను జీఎస్టీ, కస్టమ్స్ శాఖ చీఫ్ కమిషనర్ సంజయ్ రాధి వర్చువల్ విధానంలో గుంటూరు జీఎస్టీ భవన్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ శిబిరాల్లో మొత్తం 4059 మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేసినట్లు చెప్పారు. జీఎస్టీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మొట్టమొదటి, అతిపెద్ద మెగా రక్తదాన శిబిరం ఇదేనన్నారు. గత సంవత్సరం 1412 యూనిట్ల రక్త సేకరణను అధిగమించి, అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ రికార్డ్స్‌లోకి ప్రవేశించిదని తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ప్రశాంత్ కుమార్, రామకృష్ణ రాజు, అసిస్టెంట్ కమిషనర్లు కల్యాణ్ చక్రవర్తి, రవికుమార్, నాగరాజు, సూపరింటెండెంట్లు ఈశ్వర్, గాదె శ్రీనివాసరెడ్డి, యుగంధర్, మూర్తి, నవీన్, సురేష్, నందిపాటి పాల్గొన్నారు.



వర్చువల్ విధానంలో రక్తదాన శిబిరం ప్రారంభం

### రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆపదలో ఉన్న తోటివారిని ఆదుకునేందుకు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కేంద్ర పన్నులు, కస్టమ్స్ శాఖ గుంటూరు కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం కేంద్ర పన్నులు–కస్టమ్స్ శాఖ, రెడ్ క్రాస్ సహకారంతో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో మెగా మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని, యువత ఎక్కువగా రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పి. రామచంద్రరాజు, జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ ఏబీపీ మనోహర్, కేంద్ర పన్నులశాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.పాండురంగారావు, సూపరింటెండెంట్ రాజేశ్వరీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం జిల్లా అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, ఆర్. జయ శైలజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 13న అంతర్ కళాశాల సాహిత్య, సాంస్కృతిక పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 13న నిర్వహిస్తున్న సాహిత్య, సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని యువజన సర్వీసులశాఖ స్టెప్–స్వశక్తి, గుంటూరు ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.వెంకటేశ్వర్లు కోరారు. హిందూ కళాశాల లలిత కళా సమితి, స్టెప్–స్వశక్తి, యువజన సర్వీసుల శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న పోటీల బ్రోచర్‌ను గురువారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హిందూ కళాశాల వేదికగా కళాశాల స్థాయి విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్, వక్తృత్వం, దేశభక్తి గీతాలు, దేశభక్తి గీతాల బృందనాట్యం తదితర అంశాల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామని, పోటీల్లో పాల్గొనేందుకు ఎటువంటి ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు ఈనెల 10వ తేదీలోపు పేర్లను 98481 10174, 96406 80307 నంబర్లలో నమోదు చేసుకోవాలని కన్వీనర్ డాక్టర్ ఏ.బాలశౌరి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి. మల్లికార్జునప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.కాళిదాస్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.వేణుగోపాల్, స్టాఫ్ అసోసియేషన్ కార్యదర్శి పి.వి.రాము పాల్గొన్నారు.

# వాస్తవాలకు ప్రతిబింబాలు మోదుకూరి రచనలు

ఏఎన్‌యూ: సమాజంలో వాస్తవ పరిస్థితులకు ప్రతిబింబాలు మొదుకూరి జాన్సన్ రచనలు అని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె. గంగాధరరావు అన్నారు. యూనివర్సిటీ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం సినీ కవి, రచయిత మోదుకూరి జాన్సన్ 90వ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మోదుకూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోదుకూరి రాసిన సినిమా పాటలు, మాటలు, నాటకాలు నేటికీ సమాజంలోని వాస్తవ పరిస్థితుల్ని తేటతెల్లం చేస్తాయని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ సమాజంలోని వాస్తవ పరిస్థితుల్ని తన కలం ద్వారా చాటి చెప్పిన కవి జాన్సన్ అన్నారు. ఏఎన్‌యూ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయనకేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్ అధ్యక్షోపన్యాసం చేశారు. మోదుకూరి జాన్సన్ విశాల దృక్పథాన్ని సమాజానికి మరింత చేరువ చేసేందుకు అధ్యయన కేంద్రం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ కోయి కోటేశ్వరరావు, అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ టి. పృథ్వీరాజ్, ఏఎన్‌యూ డిగ్రీ పరీక్షల కోఆర్డినేటర్, తెలుగు అధ్యాపకులు ఆచార్య ఎన్‌వీ కృష్ణారావు, అంబేడ్కర్, పూలే, గాంధీ అధ్యయన కేంద్రాల డైరెక్టర్లు ఆచార్య వై. అశోక్ కుమార్, ఆచార్య త్రిమూర్తిరావు, డాక్టర్ సోమశేఖర్, నాటక కళాకారుడు సుద్దపల్లి శరత్, ఉద్యోగ సంఘ నాయకులు కె. సుబ్బారావు, కె. కనకరాజు, డాక్టర్ ఎన్. ప్రసన్నకుమార్ ప్రసంగించారు. డాక్టర్ పృథ్వీరాజ్ రచించిన పరిశోధనా గ్రంథం 'మోదుకూరి జాన్సన్ సినిమా సాహిత్యం' పుస్తకాన్ని వీసీ, అతిథులు ఆవిష్కరించారు.



మోదుకూరి జాన్సన్ సినిమా సాహిత్యం పుస్తకావిష్కరణ చేస్తున్న వీసీ

## అభివ్యక్తి నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు మెండు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు అభివ్యక్తి నైపుణ్యాల్ని అభివృద్ధి పరచుకోవడం ద్వారా ఉపాధి అవకాశాల్ని అందిపుచ్చుకోగలరని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కె.వి.బ్రహ్మం పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో గురువారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మం మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగాలు రావడం కష్టంగా మారిందని, అయితే విద్యార్థులు తమలోని అభివ్యక్తి నైపుణ్యాల్ని వెలుగులోకి తేవడం ద్వారా తేలిగ్గా పొందగలరని తెలిపారు. కష్టపడే తత్వం, నిజాయతీతో కూడిన స్వభావం, అభివృద్ధిలో ముందుకు వెళ్లే ఆలోచన ఉంటే జీవితంలో మంచిస్థితికి చేరుకుంటారని సూచించారు. టీజేపీఎస్ పీజీ కళాశాల అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాంసుందర్, వాసవీ విద్యానిధి కమిటీ కార్యదర్శి పోలిశెట్టి నాగ సుందరం ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జెన్ ప్యాక్ట్, మాస్టర్ మైండ్స్, వండర్ వరల్డ్, ఈనాడు సంస్థల ప్రతినిధులు వివిధ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో పీజీ, డిగ్రీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్. అనితాదేవి, ఏబీపీ మనోహర్, ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ చంద్రశేఖర్, అధ్యాపకులు జి. సురేష్‌బాబు, డాక్టర్ రవి, డాక్టర్ కామేశ్వరశాస్త్రి, డాక్టర్ చంద్ర, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.